క్లుప్తంగా

దోమల వృద్ధికి చెక్ పెట్టాలి



వడ్లూరులో కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

ఉండ్రాజవరం: డెంగీ వ్యాధికి కారణమైన దోమల వృద్ధికి చెక్ పెట్టాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు కోరారు. వడ్లూరు గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు ఆశా వర్కర్లు అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో జరిగిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మురుగు గుంటలు, నీళ్ల కుండీలు, టైర్లు, తాగి పడవేసిన కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నీళ్లు ఉంచకూడదని, వీటి వల్ల దోమల పెరిగిపోతాయని తెలిపారు. అందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరూ మీ పరిసరాలల్లో చెత్త, మురుగు నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, వైఎస్సార్ క్లినిక్ సీహెచ్‌వో బ్రహ్మానందం, గ్రామ ఆరోగ్య కార్యదర్శి రజనికుమారి, హెల్త్ అసిస్టెంట్స్ ఎం.శ్రీనివాసు, ఆశా కార్యకర్తలు భారతి, నిర్మల, గంగాలక్ష్మి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

ఉండ్రాజవరం: స్థానిక ఉన్నత పాఠశాల పదో తరగతి (ఇంగ్లీషు, తెలుగు) చదువుతున్న 200 మంది విద్యార్థులకు యూటీఎఫ్ ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్స్‌ను మంగళవారం అందజేశారు. ఈస్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు ఆర్థిక సహకారంతో అందజేశారు. రూ.20 వేలు ఖర్చు చేసి స్టడీమెటీరియల్‌ను విద్యార్థులకు అందించి ఎంతో మేలు చేకూర్చారని హెచ్‌ఎం విశ్వప్రసాద్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ భాస్కర్, ఆళ్ల సుబ్బారావు, దుర్గాప్రసాద్, అజూబా, నాగసుందరి, పద్మావతి, పద్మజారాణి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుదాం



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నిడదవోలు రూరల్: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శామ్యూల్, సాహితి ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మణరావు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగిద్దాం



పట్టణంలో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

నిడదవోలు: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకుందామని విద్యుత్ శాఖ ఈఈ టి.వీరభద్రరావు అన్నారు. పట్టణంలో మంగళవారం ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు విద్యుత్‌పై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ విద్యుత్ ఈఈ కార్యాలయం నుండి ప్రారంభమై స్థానిక గణేష్ సెంటర్ వరకూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ డీఈలు బి. శ్రీధర్, పి.అచ్యుతాచారి, డి.రాజన్నబాబు, ఎస్.రవిశంకర్, డివిజన్ ఏఈలు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

నల్లజర్ల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖ పరిధిలో పని చేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు బుధవారం నుంచి సమ్మె చేయనున్నారు. విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సీఎంఆర్టీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మండల అకౌంటెంట్లు, మెసెంజర్లు, పాఠశాలల్లో పని చేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ, పార్ట్ టైం టీచర్స్ సమ్మెలో పాల్గొనున్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

ప్రకాశం నగర్: ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అభిషేకాలు, సాయంత్రం విశేష సామూహిక శాంతి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని దూళిపాళ మహాదేవమణి చక్కని వ్యాఖ్యానంతో విశ్లేషించారు. అనంతరం లక్ష పుష్పార్చన, అన్నసమారాధన జరిగాయి. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భరోసా అదిరింది

- వరి దిగుబడి బాగు.. కొనుగోలు భేష్
- గతేడాది మద్దతు ధర 100 కిలోలు రూ.2,060, నేడు రూ.2,180
- ఎకరానికి 32 నుంచి 36 బస్తాల దిగుబడి
- ఆర్‌బీకేల ద్వారా కొనుగోలుతో లాభం
- ధాన్యం అమ్మిన 3 రోజుల్లో రైతు ఖాతాల్లోకి నగదు జమ
- దళారీలకు దక్కని ఆస్కారం
- తుపాను వేళ రైతులను గట్టెక్కించిన ప్రభుత్వం



నల్లాకులవారిపాలెంలో ధాన్యాన్ని రాశి చేస్తున్న రైతులు

పెరవలి: ఖరీఫ్ పంట మాసూళ్లు 85 శాతం పూర్తవ్వటంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఒకవైపు తుపాను, మరోవైపు ముమ్మరంగా ధాన్యం సేకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్ పంట వేసినప్పటి నుంచి రైతులకు ఎటువంటి దిగులు లేకపోయినా, పంట చేతికందే సమయంలో తుపాను వల్ల ధాన్యం తడిసిపోయింది. దీంతో కొద్దిగా ఇబ్బందులు పడినా, ప్రభుత్వ చర్యలతో తడిసిన ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేయటంతో రైతులు ఊపిరి తీసుకున్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయాధికారులు నిత్యం పర్యవేక్షణ చేసి, ఎప్పటికప్పుడు ధాన్యం మిల్లులకు తరలించటంతో రైతులకు భారం లేకుండా పోయిందని రైతులు కొనియాడుతున్నారు. ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, ప్రభుత్వం ధర పెంచటం, పంట మిగులు రావటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 32 నుండి 36 బస్తాల దిగుబడి రావటంతో పెట్టుబడి పోను కొద్దిపాటి మిగులుతో దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం రైతులను నిలదొక్కుకునేలా చేయటంతో పాటు, వారిలో ధైర్యాన్ని నింపిందంటున్నారు. దీంతో పాటు ధాన్యానికి గిట్టుబాబు ధర 100 కిలోలకు రూ.2,180 కల్పించటం వల్ల రైతులకు అన్నివిధాలా కలసి వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఈ ధర రూ.2,060గా ఉంది.

తగ్గిన పెట్టుబడులు

ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడులు తక్కువ ఉన్నా, గత ఐదేళ్ల కంటే ఈ ఏడాది మరీ తక్కువైందని అంటున్నారు. ఎకరానికి పెట్టుబడి రూ.18 వేలు అయ్యిందని, గతంలో ఇదే చేలు రూ.23 వేల నుంచి రూ.28 వేలు అయ్యేదంటున్నారు. ఈ ఏడాది చేలకు చీడపీడల సమస్య అంతగా లేవని, అందుకు వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు ఇవ్వటం, వాటిని రైతులు పాటించటం, వాతావరణం కలిసి వచ్చిందని చెబుతున్నారు. సాధారణంగా ఖరీఫ్‌లో ఎరువులకు రూ.4 వేలు, పురుగు మందులకు రూ.3 వేలు, నీరు పెట్టినందుకు, కూలీలకు రూ.5 వేలవ్వగా, మాసూళ్లకు రూ.6 వేల నుంచి రూ.8 వేలు ఖర్చయ్యిందంటున్నారు.

సమయానికి తెరిచిన కేంద్రాలు

ప్రభుత్వం చేలు కోతలకు సిద్ధమవుతుండగానే, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమయానికి తెరవటం రైతులకు కలిసొచ్చింది. గతంలో సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవటంతో రైతులు దళారీలను ఆశ్రయించేవారు. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేకుండా ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయటం, ధాన్యం అమ్మిన 3 రోజుల్లో నగదు తమ ఖాతాల్లో జమ కావడంతో రైతులు ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. ప్రభుత్వం మండలానికి 15 కేంద్రాలను ఏర్పాటు చేయటంతో రైతులకు ఊరటగా మారింది.

పనితీరు చాలా బాగుంది



ధాన్యం కొనుగోలు చాలా బాగుంది. మొదట అనుమానించాను కానీ, అమ్మిన మూడు రోజులకు ధాన్యం సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలోకి వచ్చింది. రైతులపై ఈ ప్రభుత్వ పనితీరు చాలా బాగుంది.
– అడపా సత్యనారాయణ, రైతు, కాపవరం

35 బస్తాల దిగుబడి



గతంలో ఖరీఫ్ పంట దిగుబడులు ఈ విధంగా రాలేదు. ఎప్పుడూ ఏదో రూపంలో నష్టపోయేవారం. ఈ ఏడాది పంట చేతికందే సమయంలో తుపాను వల్ల ధాన్యం తడిచిపోయినా, ప్రభుత్వ చర్యల వల్ల మిల్లర్లు కొనుగోలు చేశారు. ఎకరానికి 35 బస్తాలు దిగుబడులు వచ్చాయి.
– జి.సూర్యనారాయణ రాజు, రైతు, పిట్టల వేమవరం

వారంలో కోతలు పూర్తి



పెరవలి మండలంలో వరి కోతలు 85 శాతం జరిగింది, పెరవలి నుంచి 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,130 మంది రైతుల నుంచి 10,183 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. మరో వారం రోజుల్లో కోతలు పూర్తవుతాయి.
– మేరీ కిరణ్, వ్యవసాయాధికారిణి, పెరవలి

షష్ఠికి రూ.81,763 ఆదాయం



కొవ్వూరులో హుండీ సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

కొవ్వూరు: పట్టణంలో ఏటిగట్టుపై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి మహోత్సవాలకు రూ.81,763ల ఆదాయం లభించినట్టు ఆలయ కార్యానిర్వా హణాధికారి ఎం.బాలకృష్ణ తెలిపారు. హుండీ ద్వారా రూ.40,063, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.41,680 చొప్పున ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎం.నాగరాజు పర్యవేక్షణలో హుండీలో సొమ్ము లెక్కించామన్నారు. ఆలయ అర్చకులు దేవర కొండ సాయి ప్రసాద్, కొతవరపు భాను, ఎంఎస్ఎన్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

షేక్ సాబ్జి మృతి తీరని లోటు

ఉండ్రాజవరం: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాల నేత ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి తీరని లోటు అని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.విశ్వప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఐ.రాంబాబు, యూటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షుడు ఎస్.లక్ష్మి నారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ కె.మాణిక్యాలరావు, కార్యదర్శి పి.సద్గుణశీల, ఎస్‌టీయూ జిల్లా సంఘం బాధ్యులు ఎస్‌డీ శ్రీనివాసు, నిరీక్షణ రాజు, ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధికి అడ్డొస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉసులుమర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం



ఉసులుమర్రులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: గ్రామాల అభివృద్ధికి ఏ పార్టీవారైనా అడ్డంకిగా మారితే సహించేది లేదని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హెచ్చరించారు. పెరవలి ఉసులుమర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, గ్రామాల అభివృద్ధికి లక్షల కోట్ల నిధులు ఇస్తున్నామని, వీటి అభివృద్ధికి ప్రతిపక్షపార్టీలు అడ్డు తగులుతూనే ఉన్నారన్నారు. ఈ గ్రామంలో సుమారు రూ.4 కోట్లతో వివిధ పనులు చేపట్టామని, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సుమారు రూ.20 కోట్ల మేర లబ్ధిచేకూరిందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వం కావాలా లేక ప్రతిపక్షాలు చెప్పే మోసపూరిత వాగ్దానాలు కావాలా మీరే తేల్చుకోవాలని, మేలు చేసిన ప్రభుత్వానికే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు వీరమళ్ళు సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్టి రాంబాబు, మండల గృహసారదుల అధ్యక్షుడు రామడుగుల సూర్యనారాయణ, సర్పంచ్ వీరమళ్ళు నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జిన్ని వరలక్ష్మీదేవి, గ్రామ పార్టీ అధ్యక్షులు దొలూరి శ్రీనివాస్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం



కొవ్వూరులో శ్రీవెంకటేశ్వరుని ప్రత్యేక రథం

కొవ్వూరు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కొవ్వూరు పట్టణంలో సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీటీడీ బోర్డు మెంబర్ గాదిరాజు వెంకట సుబ్బరాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మహోత్సవం ఏర్పాటు చేయించారు. మంగళవారం టీటీడీ నుంచి ఉత్సవ విగ్రహాలు కొవ్వూరు చేరుకున్నాయి. టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకూ ఈ మహోత్సవం నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పేరిచెర్ల బోసురాజు వేదిక వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనితతో పాటు పలువురు ప్రముఖ ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఇప్పటికే మహోత్సవంపై నియోజకవర్గంలో ప్రచారం చేశారు.

వైద్య సహాయకుడు జీవీవీకి సత్కారం



నల్లజర్ల పీహెచ్‌సీ ఉద్యోగి ప్రసాద్‌ను సత్కరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

నల్లజర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సహాయకుడిగా పని చేస్తున్న జీవీవీ ప్రసాద్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం సత్కరించారు. గత ఐదేళ్లుగా ఆసుపత్రి అభివృద్ధికి విశేష కృషి చేసి, కరోనా సమయంలో ఎంతో మందికి సేవలందించారని వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు మద్దిపాటి ప్రసాద్ మంత్రికి వివరించారు. సర్పంచ్ పల్లి జ్యోతి, నల్లజర్ల, పోతవరం సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ ,మండలకన్వీనర్ గగ్గర శ్రీనివాస్,నీరుకొండ జయకృష్ణ, వెల్లంకి వెంకటసుబ్రమణ్యం,తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

పథకాలు ప్రజలకు అందేలా చూడాలి



సంజీవపురం సభలో మాట్లాడుతున్న సోము వీర్రాజు

గోపాలపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందేలా చూడాలని, ఆ బాధ్యత అధికారులపై ఉందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. గోపాలపురం మండలం సంజీవపురం సచివాలయం వద్ద మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర ముగింపు సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వాటిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులు, పార్టీ నాయకులపైనా ఉందన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా అనేక గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు, నాయకులు శెట్టిపల్లి శివనాగరాజు, కాట్రగడ్డ రవీంద్ర, కొండేపాటి రత్నాజీచౌదరి, కె సత్యసాయిరాం,దున్నా సుమన్‌బాబు,వేములపల్లి నరేంద్ర,బివీరరాఘవులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ



గోపాలపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోపాలపురం: వినియోగదారుల హక్కు చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి అన్నారు. గోపాలపురంలో మంగళవారం వినియోగదారుల హక్కు చట్టంపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై వినియోగదారునికి హక్కు ఉంటుందన్నారు. ప్రభుత్వం వినియోగదారులకు హక్కుతో పాటు కోర్టును కూడా ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారంతో పాటు వినియోగదారుల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



వృద్ధుడికి బియ్యం అందజేస్తున్న దృశ్యం

చాగల్లు: మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నందిగంపాడు గ్రామంలో నిరుపేదలకు సాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి 15 కేజీలు చొప్పున బియ్యంను వైఎస్సార్ సీపీ నాయకులు చీలి ప్రసాద్ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధి మల్లిపూడి ధనరాజు, సర్పంచ్ కుదప రాంబాబు, అతుకూరి శ్రీనివాస్, ఈద్పుగంటి కృష్ణ, శేషారావు, భక్కి, అనందరావు, నరేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

దేవరపల్లి: ఏపీటీఎఫ్ దేవరపల్లి మండల శాఖ నూతన కార్యవర్గ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం చిన్నాయగూడెం మండల ప్రాథమిక పాఠశాలలో జరిగిన మండల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు డీడీరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గౌరవాధ్యక్షుడిగా పి.రామకృష్ణ, అధ్యక్షుడిగా వేల్పుల రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా పులపాకుల గంగరాజు, ఉపాధ్యక్షులుగా షేక్ భాషా, వై.పద్మ, కె.శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎం.గణపనాథ్, ఎం.స్వామి, కె.ఎల్.కనగదుర్గ, కె.సుధాకర్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా షేక్ బాబ్జి, టి.మోహనరావు, కె.సురేష్‌కుమార్, ఎం.అప్పారావు, ఏఎల్ మధులత, ఎస్.నాగదుర్గారావు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ సభ్యులుగా వి.శ్రీను, యు.రాఘవ, వి.సుభాషిణి ఎన్నికైనట్టు జిల్లా అధ్యక్షుడు డీడీ రావు తెలిపారు.

డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు



అన్నవరప్పాడులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయాధికారి శేఖర్‌బాబు

పెరవలి: జిల్లాలో శాఖా గ్రంథాలయాలను సాంకేతింగా అభివృద్ధి చేయటమే కాకుండా పాఠకులకు అనుగుణంగా పుస్తకాలు సరఫరా చేస్తున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాయాల అధికారి ఎం.శేఖర్‌బాబు తెలిపారు. పెరవలి మండలంలో మంగళవారం ఆయన పెరవలి శాఖా గ్రంథాలయల రికార్డులను పరిశీలించి అనంతరం పుస్తక నిక్షిప్త కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా మార్చుటానికి చర్యలు చేపట్టామని ఇప్పటికే పట్టణాల్లో ఉన్న వాటిని పూర్తి చేశామని, గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేపట్టామన్నారు. జిల్లాలో గ్రంథాలయాల భవనాల మరమ్మతులు చేపట్టామని, నూతన భవనాల నిర్మాణాలు చేస్తున్నామని, ప్రభుత్వం డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. పెరవలి మండలంలో శాఖా గ్రంథాలయాలు, పుస్తక నిక్షిప్త కేంద్రాలు నిర్వహణ చాలా బాగుందని, రికార్డుల పరిశీలిస్తే తెలుస్తున్నాయని వివరిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయపాలకుడు ఎం.వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వరరావులు, బీడీసీలు పాల్గొన్నారు.

మేలును గుర్తించి.. ఆదరించండి..



తాడిమళ్లలో పథకాల సమాచార బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు పల్లారావు, ప్రజాప్రతినిధులు



యర్నగూడెంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్



చిక్కాలపాలెంలో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును గుర్తించుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. తాడిమళ్ల గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అభివృద్ధి పనుల వివరాలకు సంబంధించిన సమాచార బోర్డులను వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ బయ్యే రాధారాణి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను పల్లారావు ఎగురవేసి సంక్షేమ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పల్లె నిద్ర చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నాయకులు కాగిత లక్ష్మయ్య, కాపకాయల సూర్యనారాయణ, సత్తిపండు, కొప్పుల రామదేవుడు, తిరుమళ్ల దుర్గారావు, బయ్యే లక్ష్మణరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

చిక్కాలపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్

చాగల్లు: చిక్కాలపాలెం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిస్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ కొయ్యే మణి, ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు, ఏఎంసీ డైరెక్టర్ అయినం నాగరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, సొసైటీ అధ్యక్షులు గంగిశెట్టి వాసు, బీసీ సెల్ నాయకులు మేకా రాజు, బండి అశోక్‌బాబు, బండి శోభన్‌బాబు, సచివాలయ అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

యర్నగూడెంలో వై ఏపీ నీడ్స్ జగన్

దేవరపల్లి: యర్నగూడెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమానంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గత నాలుగున్నర ఏళ్లలో గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకరాలు, అభివృద్ధి కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ ప్రారంభించగా, పార్టీ పతాకాన్ని నరహరిశెట్టి రాజేంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, గ్రామ వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



